# 40. మాకొద్దీ నల్లదొరతనము

"అఫెన్స్ ఈజ్ ది బెస్ట్ మోడ్ ఆఫ్ డిఫెన్స్ (ఆగ్రహమే అత్యుత్తమమైన ఆత్మరక్షణ విధానం) అని నమ్మిన వాళ్లలో మా బుట్టయ్యగారొకరు!" అన్నాడు తిరుపతిరావు.

"బుట్టయ్యా? అతనెవరు?" అని అడిగాను.

" మా కొత్త జె.ఎం.డి; నువ్వు కలుద్దామని వచ్చేవే; ఆయన!"

✣ ✣ ✣

తిరుపతిరావు హైదరాబాదులో ఒక ప్రభుత్వ యాజమాన్య సంస్థలో జెనరల్ మేనేజరుగా పనిచేస్తున్నాడు. ఆ సంస్థలో తిరుపతిరావు కాక ఇంకో ఐదుగురు జెనరల్ మేనేజర్లున్నారు. జి.ఎం. - ప్రొడక్షను; జి.ఎం - పర్చేజెస్ అండ్ డిస్పోజల్స్; జి.ఎం. - ఫైనాన్సు; జి.ఎమ్. - మెషినరీ అండ్ ప్లాంట్స్; జి.ఎం.- మార్కెటింగు.

(తిరుపతిరావు జి.ఎం.-పెర్సనెల్ అండ్ ఎడ్మినిస్ట్రేషను).

భారీ యంత్రాలున్నాయి, అంతకంటె భారీ సంఖ్యలో ఉద్యోగులూ కార్మికులూ ఉన్నారు ఆ సంస్థలో. ప్రజలకు ఉపయోగకరమైనవి, అమ్మకాలు బాగా ఉండేవీ అయిన కొన్ని రకాల సరుకులు తయారుచేస్తుంది. ఈ సంస్థ చాలా ఏళ్లు ప్రయివేటు యాజమాన్యంలో ఉండేది. కార్మిక సంఘాల బలం పెరిగిన కొద్దీ ఉద్యోగులకీ కార్మికులకీ జీతాలు పెంచడం, ప్రావిడెంటు ఫండు - గ్రాట్యుయిటీ- ఎల్.టి.సి. - మెడికల్ - లీవ్ ఎన్‌కాష్‌మెంట్ లాంటివెన్నో ఇవ్వడం తప్పనిసరై; ప్రయివేటు యాజమాన్యం తట్టుకోలేక చేతులెత్తేస్తే ప్రభుత్వం ఆ సంస్థని స్వాధీనం చేసుకొని లాభాల్లో ఉన్న సంస్థని నష్టాల్లోకి ఈడ్చి కార్మిక సేవే దేశ సేవ అన్న ధోరణి తెచ్చుకుంది. ఇటీవల "మాసంస్థకి ఈ ఏడాది ఇన్ని కోట్ల రూపాయలు నష్టం వచ్చింది." అని ప్రభుత్వానికి నివేదికలు పంపడం, ప్రభుత్వం ఆ మేరకి సబ్సిడీలు ఇవ్వడం జరుగుతోంది ఆ సంస్థలో. అంతకిముందు ఒక జెనరల్ మేనేజరు, ఒక మేనేజింగ్ డైరక్టరు మాత్రం ఉండేవారు. ఇప్పుడు ఒక ఎం.డి; ఒక జాయింట్ మేనేజింగ్ డైరెక్టరు; ఆరుగురు జెనరల్ మేనేజర్లు ఉన్నారు. సాంకేతిక కారణాలవల్ల మంత్రి పదవికి అర్హత కోల్పోయిన అధికార పార్టీ పెద్దమనిషొకరు చైర్మన్‌గా ఉంటారు. ఎం.డి, జె.ఎం.డి లను రాష్ట్ర ప్రభుత్వ సంప్రదింపులతో కేంద్ర ప్రభుత్వం పంపుతుంది. జి.ఎం.లలో కొందరు అంతకుముందు నుండి ఉన్నవాళ్లలో ప్రొమోషన్లు పొందినవాళ్లు; కొందరు రాష్ట్ర ప్రభుత్వం ఎక్కణ్ణించో తెచ్చివేసినవాళ్లు - ఇంకా మేనేజర్లు, డిప్యూటీ మేనేజర్లు, అసిస్టెంటు మేనేజర్లు, డిప్యూటీ జెనరల్ మేనేజర్లు, అసిస్టెంటు జెనరల్ మేనేజర్లు ఇలా వందల సంఖ్యలో అధికార్లు (వాళ్లందరికీ కార్లు, చాలామందికి ఇళ్లలో కూడా టెలిఫోన్లు) వచ్చి; సంస్థ ఎట్టి పరిస్థితుల్లోనూ లాభాలు చేసుకోలేనంతగా సంక్షేమ సాగరం అయింది. వర్కర్సుని తగ్గించి అధికార్ల సంఖ్య పెంచే సంస్కృతి బాగా నాటుకుంది.

✣ ✣ ✣

"మీ కొత్త జె.ఎం.డి పేరు బుట్టయ్యా? నేనింకోటేదో అనుకుంటున్నానే?" అన్నాను.

"బి.కె.గిరి - అదేగా, నువ్వు విన్న పేరు? పూర్తి పేరు కనిగిరి బుట్టయ్య" అని నవ్వేడు తిరుపతిరావు.

"నువ్వన్నీ బలే బాగా కూపీలు లాగుతావే!" అన్నాను సంభ్రమంగా.

తిరుపతిరావు నా సంబరంలో భాగం పంచుకోలేదు. "నువ్వు మా జె.ఎం.డి.ని కలవడాని కొచ్చేవు కదా అని ఆయన స్వభావం గురించి చిన్న చిట్కా ఇచ్చేను; అంతే. నీపని అవాలంటే ఇది గుర్తుంచుకోవాలి", అని నాతో చెబుతూ ఉండగా ఇంటర్ కమ్ గీపెట్టింది. "యస్సార్. ఇక్కడే వున్నారు సార్. పంపిస్తున్నాను సార్!" అన్నాడు, అందులో. "పిలుపు నీకే. వెళ్లు, బెస్టాఫ్ లక్!...." అన్ని "సార్" లు ఎందుకన్నాడో అర్థం కాలేదు.

నేను బి.కె.గిరి గారి ఛేంబర్స్‌లోకి వెళ్లేసరికి అక్కడ ముగ్గురు తలలు నెరిసిన స్ఫురద్రూపులున్నారు. అందులో ఒకాయన శాస్త్రిగారు. జెనరల్ మేనేజర్ - మార్కెటింగు. ఆయన నిలబడి వుండగా నేను కూర్చోవలసొచ్చిందే అని బాధపడుతూ నేను వి.ఐ.పి.ని కాకపోయినా గెస్టుని కనక కూర్చున్నాను.

"నో నో, శాస్త్రిగారూ, యు ఆర్ రాంగ్. ఆ ఆర్. ఈ.సీ. ఆఫీస్ ఆర్డర్ మనకి రాకపోతే హెడ్స్ విల్ రోల్ డవున్ (పుర్రెలు ఎగురుతాయి) సెండ్ అవర్ డాగ్స్ అండ్ సీ దట్ దే కేచ్ (మన ఉద్యోగుల్ని పంపి బేరం చిక్కించుకొనేలా చూడండి.) అయినా నా కళ్లు ఎన్నాళ్లు కప్పుతావయ్యా? వెళ్లు!"

"మన ధరలు ఎక్కువా, నాణ్యత తక్కువా అని వాళ్లు నిర్మొహమాటంగా రాసేశారు సార్.... కె. అండ్ పి. కంపెనీ వాళ్లు మన సరుకుకంటే మంచిది ఆఫర్ చేస్తూ మనకన్నా తక్కువకి కోట్ చేశారు."

"అయితే ఏంటంటారు శాస్త్రిగారూ? ప్రయివేట్ కంపెనీల్లా మనం వాళ్లకి లంచాలిచ్చి మందు పార్టీలు కొట్టించాలంటావా? అసలు నిన్ను ముందు శాక్ చేస్తే (పీకి పారేస్తే) నీ శ్టాఫ్‌కి బుద్ధొస్తుంది. షటప్ అండ్ గెట్ లాస్ట్!"

శాస్త్రిగారు రెండూ మూసుకొని వెళ్లారు. మిగిలిన ఇద్దరూ లేచారు. "ఒ.కే. నేను ఈవ్నింగ్ ఫోరో క్లాక్కి (సాయంకాలం నాలుగింటికి) యూనిట్ "బి" కి వస్తాను. సీ ఎవ్విరి థింగ్ ఈజ్ ఇన్ ఆర్డర్ అండ్ ఐ వేస్ట్ నాటె మినిట్! (అంతా సక్రమంగా ఉండేట్టు చూడండి, నాకొక్క నిమిషం కూడా వృథా కాకూడదు)" నిలబడి, ఒకానొక నాయకుడి విగ్రహం దేశవ్యాప్తంగా చూపించే భంగిమలో వేలెత్తి చూపించేరు గిరిగారు. వాళ్లు కూడా వెళ్లేరు.

గిరిగారు కూర్చుని, తన టేబిలు మీద ఉన్న మూడు టెలిఫోన్లలో ఒకదాని బటన్ నొక్కి "వాట్ హేపెండ్ టు కోటిరత్నం?" అన్నారు. "లైన్ దొరకడం లేదు సార్" అని నీరసంగా జవాబు. "అంటే నీ ఉద్దేశమేంటి? నేన్ లేచి ఆడి దగ్గిరికి పరిగెత్తాలా? అయిదు నిమిషాల్లో ఆణ్ణి కలపకపోతే నివ్వు రేపు తెల్లారేపాటికి బద్రాచెలంలో జాయిన్ గావలసొద్ది. అర్దవైందా?" ఫోన్ ఆఫ్ చేసి నా వేపు చూసేరు గిరిగారు. "యస్?" అన్నారు. నేను నాపని ఏమిటో చెప్పేను.

గిరిగారు లేచారు. నేను కూడా లేవవలసొచ్చింది మరి.

"మీ చేర్మన్ గారికేం పోయింది, ఏదన్నా మాట్లాడతారు ఫోన్‌లో. నీ తమ్ముడు నీకెంత ఇంపార్టెంటో మునిరత్నంకి ఆయన బార్య అంతకంటే ఇంపార్టెంటు. యూనిట్ "బి"లోంచి

మునిరత్నంని కదిపిస్తే ఎపిలెప్సి పేసెంట్ (మూర్ఛరోగి) అయిన బార్య సచ్చిపోద్ది. వర్క్ చైటాకి ఆరు కిలోమీటర్లు రావటం కష్టమనిపిస్తే మీ బ్రదర్‌ని రిజైన్ జేసీమను. మీ డిపార్టుమెంట్‌లో ఏదేనా ట్రాన్సుఫర్ జెయ్యాలని నేనే ఫోన్‌జేసి చెప్తే బాగుంటాదా? వెల్లండి. సూద్దార్లే. ఒక వారం బొయినాక గనిపిచ్చు: ఒచ్చే బుదవారం!'

జెనరల్ మేనేజరు (మార్కెటింగ్) శాస్త్రిగారికంటె నాకే మంచి మర్యాద జరిగింది. శాస్త్రిగారూ అని మొదలెట్టి షటప్ దాకా వెళ్లిన భాష నా విషయంలో సమతూకంగానే వెళ్లినట్టయింది. "నీకున్న లాంగ్వేజి నీ మేష్టరికుందీ?" అని కాంప్లిమెంటు చెయ్యాల నిపించింది.

✤ ✤ ✤

మరుచటి బుధవారం ఆ ఆఫీసుకి వెళ్లేను. గేట్లోంచి లోపలికి వెళ్లగలిగేను గాని వరండా దాటి తిరుపతిరావు రూముకి వెళ్ళడం మహా కష్టమైపోయింది. వరండా నిండా జనం పచ్చి నేలమీద మఠాలు వేసుకుని కూచున్నారు, కవిసమ్మేళనంలో ఆడియన్సులాగ.

"ఫోన్ చేసి రావల్సింది" అన్నడు తిరుపతిరావు.

"గిరిగారు ఇవాళ రమ్మన్నారు. అందుకని ఫోన్ చెయ్యకుండానే వచ్చాను."

"ఆయన ఆఫీసులో లేరు. ఇంకో ఆఫీసులో ఎడిషనల్ ఛార్జి చేస్తున్నాడు కదా; అక్కడ కూచున్నాడు. ఇక్కడకొస్తే గొడవలైపోతాయని!"

"గొడవలెందుకు?"

"వరండాలో జనం కూర్చున్నారు చూళ్లేదూ? వాళ్లంతా ఈ ఆఫీసులో గుమాస్తాలూ టైపిస్టులూ సూపరింట్లూ స్టెనోగ్రాఫర్లూ ప్యూన్లూ అలాంటివాళ్లంతాను. వాళ్లు కిందటి శనివారం నుంచీ అలాగే కూర్చున్నారు, సీట్లలోకి వెళ్లరు; పని చెయ్యరు. అంతా బుట్టయ్యగారి ప్రతాపమే."

"అసలేం జరిగిందిటా? నేను వినొచ్చా?"

తిరుపతిరావు లేచి తలుపుదాకా వెళ్లేడు. ఎవర్నో పిల్చేడు. కాఫీగట్రా ఏర్పాటుచేస్తున్నాడేమో; ఆ కాఫీ జనం మీద వొంపకుండా యెలా తెస్తాడు వాడెవడోనూ- అని ఇదవుతూ వుండగానే ఇతడు వెనక్కొచ్చేడు. ఇతని వెనక ఇంకొక-!

"అరె, కృష్ణమూర్తా? అన్నట్టు నువ్విక్కడే ఉన్నావు కదూ. మర్చేపోయాను. దా. కూచో." అన్నాను.

"మీ రికార్డు మరోసారి పెట్టండి" అన్నాడు తిరుపతిరావు.

కిందటి శుక్రవారం మధ్యాహ్నం ఒకటీ యాభై. జె.డి.ఎం. - బి.కె.గిరి. గారి ప్యూను కాంటీన్‌కొచ్చి "సార్ మిమ్మల్ని పిల్చిండు" అని చెప్పేడు. లిఫ్ట్ లేదు. మూడంతస్తులూ ఎక్కి జె.డి.ఎం. రూం కెళ్లాడు. ఆయన 350 పేజీల ఫైలు ఒకటి చదువుకుంటూ ఇతన్ని చూళ్లేదు. ఇతను కూర్చున్నాడు. కూర్చున్న మరుక్షణం ఆయన ఫైలు మూసేడు. 'నా ఎదురుగుండా కూర్చోటానికి నీకెంత ధైర్యం!' అని కోపంగా పలకరించేడు. "సార్, తమరు పిలిచారంటే వచ్చేను. 56 ఏళ్లవాణ్ణి. మూడంతస్తులు ఎక్కివచ్చాను. మీరు ఫైల్ చూసేక మాట్లాడుతారు కదాని కూర్చున్నానంతే తప్పా మీకు ట్రబులవుతుందని అనుకోలేదు." అన్నాడు కృష్ణమూర్తి.

"ఈ ఆఫీసుకి ఎక్కణ్ణించి వచ్చేవు?"

"ఎక్కణ్ణించో కాదండి. ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్‌ఛేంజి నుంచే వచ్చాను. 36 ఏళ్లయింది."

"యు థింక్ యుఆర్ ఇంటెలిజెంట్? (తెలివిగా మాట్లాడాననుకొంటున్నావా?)"

"ఈ ఆఫీసులో తెలివిగలవాడంటూ ఎవడూ లేడుసార్. అంతా అదృష్టవంతులూ దురదృష్టవంతులూ."

"షటప్ అండ్ గెటౌట్ (నోరు మూసుకుని అవతలికి నడు)"

"ఏదో మాట్లాడాలని పిలిచారట, సార్?" - ఫైలు చూపిస్తూ.

"నో.గో. (అక్ఖర్లేదు, వెళ్ళు)"

మర్నాడు (శనివారం) ఒంటిగంటగల్లా ఛార్జి మెమో ఇచ్చేరు కృష్ణమూర్తికి. అది పుచ్చుకుని వెళ్లాడు. "పెర్సనల్ రిజిస్టర్లూ పీరియాడికల్ రిజిస్టర్లూ పెట్టలేదని దీంట్లో రాశారు సార్. నేను గుమస్తాని కాదు. సబ్ డివిజన్ ఆఫీసర్ని, వెనక 26 మేనేజర్ పోస్టులు శాంక్షన్ చేయించుకుందికి 220 గుమాస్తా పోస్టులు సరెండర్ చేసేరు. అప్పుడు క్లరికల్ వర్కంతా ఎవరు చేస్తారని ప్రభుత్వం అడిగితే, ఎస్.డి.ఓ.లూ సూపరెంట్లూ చేస్తార్లెమ్మని రాసుకున్నారు. పి.ఆర్.లు రాయడం మానేసి ఏడెనిమిదేళ్లు అయింది.

ఈ ఛార్జిమెమో అన్యాయం సార్. తమ ఛాంబర్స్‌లో తమ అనుమతి లేకుండా తమకెదురుగా కూర్చున్నానని తమకి కోపం వచ్చినందుకే ఇది సార్. దయచేసి అది తప్పుగా భావించకండి సార్. ఎందుకంటే తెల్లదొరలు ఈ దేశం వదిలి వెళ్లాక అలాటివి తప్పులుగా పరిగణించడం మానేశారు సార్". అని వివరించేడు కృష్ణమూర్తి.

'నో. కమప్ ఇన్ రైటింగ్! (ఆపు. నువ్వు చెప్పదల్చుకున్నదేదో రాతమూలకంగా చెప్పుకో.)'

"కృష్ణమూర్తి 36 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారిక్కడ. ఈ కంపెనీ ప్రయివేటు సెక్టార్‌లో ఉన్నప్పుడూ, గవర్నమెంటు తీసుకున్నాకా కూడా ఈయన కార్యదీక్ష మీదా, నిజాయితీ మీదా "రెండో అభిప్రాయం" అంటూ లేదు. మాకుమినిస్టర్ మారినప్పుడల్లా ఇక్కడి కొచ్చి ఛైర్మన్, ఎం.డీలతో పాటు కృష్ణమూర్తిలాంటి సీనియర్సుని కూడా పలకరించడం ఆనవాయితీ. ఈ ఛార్జి మెమో ఉపసంహరించుకోకపోతే ఎవ్వరూ పనిచేసేది లేదని స్టాఫంతా ఏకం అయ్యేరు. శనివారం నుండి ఈరోజు వరకు దొరగారు ఆఫీసుకు రాడం మానేశారు" అని తరువాయి కథ చెప్పేడు తిరుపతిరావు.

"ఇప్పుడేమిటవుతుంది?" అన్నాను.

"ఆయన నోరుపారేసుకుని కూడా ఉద్యోగం పోకుండా ఆయన స్వయంగా చూసుకోగలిగినట్టే, ఈయన వుద్యోగం పోకుండా చూడ్డానికి మేం అంతా వున్నాం."

బయట ఏదో అలికిడైంది. తిరుపతిరావు పరిగెట్టుకెళ్లేడు. సెక్రెటేరియట్ నుండి కాగితం వచ్చింది. బి.కె. గిరిగార్ని ఆ ఎడిషనల్ ఛార్జి ఉద్యోగంలో నిర్ధారణగా వేస్తూ ఇక్కడి జె.ఎం.డిగా ఇంకొకర్ని వేసేరుట.

"మా కొద్దీ నల్లదొరతనమూ!" అని పాడుతున్నారు అందరూను.

*("ఆంధ్రభూమి" డెయిలీ : 27-5-92)*